**మొగుడు దెచ్చిన చెనిక్కాయల మూట విప్పి గంపకు బోసుకున్నా.<br>నాతోపాటు ఇంగా మా ఊర్లోని నాలుగైదు ఇండ్లోల్లు కూడా<br>కాయలు గంపలకు బోసుకోని మా చిన్నమ్మ వాళ్లింటి ముందర వరండాలో<br>కూచొని ఎవరి కాయలు వాళ్లం ఒలసడం మొదలుపెట్టినాం.<br>పిల్లలు, పెద్దాళ్లు కూడా వచ్చి ఒలసను కుసుంటిరి.<br>మా మద్దెన దొరలిన కబుర్లే ఈ కత.**

ఎండపల్లి భారతి

13

# ఇత్తనాల చెనిక్కాయలు వలుస్తూ

గోపాలకృష్ణ





భూమి పాసుబుక్కులకు ఇత్తనాల చెనిక్కాయలు ఇస్తామంటే పొద్దుననగా బొయినాడు నా మొగుడు. సాయంత్రం ఆరైంది వచ్చేసరికి.

నేనుండుకోని, "ఏమింత టైం అయ్యింది," అంటే, "పోమ్మే సామి! ఏడికిబోయినా రాజకీయం. ఒక మైలుదూరం నిలబడినారు జనాలు. తెలిసినోల్లకి, పలుకుబడి ఉన్నోల్లకి ముందుగా ఇచ్చేస్తారు. మనట్లా నోరు లేనోళ్లకి మన టైం బాగుంటే మూట చేతికొస్తుంది. లేదంటే నాలుగు దినాలు తిరగాల్సిందే," అనే!

అదీ నిజమే. గొరగొరా పానంతో కొటుకులాడే మనిషికి నోట్లో నీళ్ల బోస్తే పానం తెపుర్లుకున్నట్టు ఈ ఎండాకాలం పొయ్యేటపుడు తొలిముంగార్ల వానలు మొదలవుతాయి. ఈ వాన్లకే చేన్లు దున్ని దుక్కులు చేసుకుంటాం. తొలిముంగార్ల వానప్పుడే ఎక్కువ ఉరుములు మెరుపులు పిడుగులు బడేది.

నేను చిన్నబిడ్డపుడు వానా గాలి ఉరుములు మెరుపులు డబ డబామంటే చాలు, చెవులు గట్టిగా మూసుకొని వాడ సందులో దాంకునేది. ఉరుమురిమినపుడల్లా మా తాత, 'పైన అర్జునుడు రతం తోలతా ఉంటాడు, గుంతలు మిట్టల్లో బండి దింపినపుడు శబ్దం వస్తుంది. బండి కుండే కట్టిజిల్ల ఊడి కిందబడినపుడు పిడుగుబడేది,' అనేది. ఉరిమినబుడు మనమింద పిడుగుబడకుండా ఉండాలంటే అర్జునా పాల్గునా ఉషా శేషమహల్ అనాలి. ఉషా, శేషమహల్ ఏంది తాతా అంటే, అవి మనూరి సినిమా టాకీసు పేర్లులే అనేది. ఆ యప్పకు నోరు తిరక్క ఏమంటే అదనేది. అందరం నవ్వుకునేది.

ఆ కార్తిల్లోనే బాగా వానలు కురిసేది అబుడు. ఇబుడు ఏడ వానలు కురుస్తున్నాయి కార్తుల్లో, ఇపుడు తిరనాల్లో బిడ్డ తప్పిపోయి దావ మర్చిపోయినట్లు వానకూడా దావతప్పి కురుస్తా ఉంది. చుట్టం చూపుగా వచ్చే వానను నమ్మలేక చేన్లుగల్లోల్లు సగానికి సగమంది చేన్లు సదరాలు జేసి బోర్లేసుకొని సేద్యాలు చేసుకుంటా ఉండారు. అంత తాకత్తు లేనోల్లు ఎట్లుండే చేన్లను అట్టేబెట్టుకుంటున్నారు. ఆర్నెల్లాయె, ఒక పదును వానబడి. మా చేనుగూడా అట్లే ఉండె.

మొన్నటి రెయ్యి ఒక ముక్కాలు పొదును వానబడింది. 'సచ్చినోని పెళ్లికి వచ్చిందే కట్న'మని ఆ పడ్న వానకే చేన్లు దున్ని దుక్కి చేసుకున్నాం.

సెనగపంట మెండుగా కండ్లజూసి పదిపదైదు ఏండ్లయింది. సెనగ గింజలు భూమిలో ఏసినా పొద్దునుంచి లోబెరుకు ఎలిబెరుకె. వాన్లను నమ్మలేకపోతుండాం. ఊర్లో వానబడితే ఊరు ముందర వానబడదు, దిగువచేనులో వానబడితే ఎగువ చేనులో బడదు. అయినా చేన్లు బీడ్లు ఉంటే చూడలేక సారిసారికి ఇత్తనాలు ఏసేది, నెత్తిన గుడ్డేసుకొని పొయ్యేది.

అది సరేలే, నా మొగుడు దెచ్చిన చెనిక్కాయల మూట విప్పి గంపకు బోసుకున్నా. నాతోపాటు ఇంగా మా ఊర్లోని నాలుగైదు ఇండ్లోల్లు కూడా కాయలు గంపలకు బోసుకోని మా చిన్నమ్మ వాళ్లింటి ముందర వరండాలో కూచొని ఎవరి కాయలు వాళ్లం ఒలసడం మొదలుపెట్టినాం. పిల్లలు, పెద్దాళ్లు కూడా వచ్చి ఒలసను కుసుంటిరి. పిల్లలు ఒలిసిన గింజలు ఒకటి నోట్లోకి, ఒకటి గంపలోకి ఏస్తావుండ్రి.

అదిజూసి మా యత్త, "ఏయ్, దుడ్డుబెట్టి కొనిండే కాయలు, తినద్దండి. బేదులు పోతాయి," అనే.

ఆ యాలకే మా చినమ్మ వొలిసిన గింజలు పిడికిట్లోకి ఎత్తుకొని, "చూడండి ఈ చెనిగ్గింజల్ని, అన్నీ చచ్చువే. ఈ గింజలేస్తే ఎట్ట మొలుస్తాయి భూమిలో?" అనే.

నేనుండుకోని, "ఏమిజేత్తాం, గవెర్నమెంటు ఏవిస్తే అవెయ్యాలిగదా," అంటి.

అంతలో ఆయమ్మ ఉండుకోని, "ఇంట్లో ఇత్తనాల కాయలు ఎత్తిపెడతా ఉన్నబుడు మాకు గుట్టకింద రాళ్లగుడ్డం ఉండే. ఆ చేనులో పండిన కాయలు గట్టిగా రాళ్లున్నట్టు ఉండే. ఆ కాయలు ఆరేడు మూటలు వాడకు బోసిపెట్టేది. మల్లా సంవత్స రానికి అదే కాయలు వొలిచేది. వలిస్తే గింజలు రాల్లున్నట్టు ఉండేవి. ఆ కాలం పాయలే," అనే.

అంతలో మా ఎంగట సిన్నమ్మ ఉండుకోని, "ఆ కాలాన చేన్లు పండినపుడు మేము ఏంటికేగాని నవస్తా ఉంటిమా! పైసా కర్చులేని పంట పండి ఇంటికొస్తా ఉండే, మాకుండేది ఊరెనకాల ఒకెకరా చేను. ఇత్తనాలకాయలు ఇంట్లోవే. దున్నే దానికి ఎద్దులు మావే. మడక మాదే. దున్నేది మేమే. ఎరువు ఎద్దుల ప్యాడే. చెనిగపంట ఒకటేనా, సాలు గింజలు ఎన్నేస్తా వుంటిమి! కందులు, అలసందులు, అనపగింజలు, జొన్నలు, ఉలవలు ఇట్లా సగలమూ బండిస్తా వుంటిమి. కూలి మనుషులు రావా లంటే బొదుళ్లు జేసుకుంటా ఉంటిమి. చేన్లో గింజలు ఏసిన పదైదు దినాలకల్లా

ఏసిన గింజలు ఏసినట్టే మొలిచి నెలకంతా బూమంతా ఆకులేసి, అట్లా పారజూస్తే సీతమ్మ తానమాడినట్లు పచ్చగా ఉండేది.

"అంత మబ్బు లేకుండా సూరుడు మేగాల ఎనకున్నబుడు వచ్చే కాంతికి సల్లగాలి తోలతా ఉంటే ఆ పచ్చని చేన్లో నిలబడి చూస్తే ఎంత సింగారంగా ఉండేదో! కేలీవిలాసంగా ఉండేది. ఏ దేశం తిరిగితే అంత సింగారం చూసేది! ఇంగా ఆ చేన్లలో గెడ్డి పెరుక్కొచ్చి గొడ్లకేద్దుము.

"ఏసిన గింజలు కాపుకొచ్చేదాకా కూరాకులు, గురుగాకు, ఎరబద్దకు, చెంచిలాకు గిల్లకొచ్చి మిరపకాయ, ఎరగడ్డ, తెల్లగడ్డ, చింతకాయ, రవంత పసుపు, ధనియాల పొడి ఏసి ఉడకబెట్టి గట్టిగా రుద్దితే సంగటి ముద్దలోకి ఏముండేదో! మా యవ్వ పాటపాడేది, 'చెంచిలాకు తిని పంచన కూచుంటే- గురువారొస్తుంది. గురిగాకు ఏమిజేతునే ఎరబద్దాకా, ఎవరికి సిరిమే గురిగాకా...'

"సాలు గింజలు కాపుకొస్తే పచ్చిగింజల కూర, పంట వొడిపితే వొట్టి గింజల కూర, ఇట్లా సమ్మచ్చరమంతా మేము గతిమారా తిని మాకు ఆశించిన వాళ్లకు పెట్టేది. ఇపుడు నీసిన కాలం. ఎకరా పంట ఎయ్యల్లంటే ఇరవై యేలుండాలి. అంత పెట్టుబడి పెట్టి పంటబెట్టినా పంట పండితే దానికి దానికి సరిపోతుంది. లేదంటే నోట్లో దుమ్మే," అనే ఆయమ్మ.

అంతలో మా నాగక్క ఉండుకోని, "ఇబుడు గవెర్నమెంటోళ్లు అన్నీ ఉచితంగా ఇస్తారంటిలే," అనే.

దానికి మా పాపులమ్మ ఉండుకోని, "కాదంట్రా... ఈ కరెంటు ఈ బోర్లు బావులు లేనపుడు మనూరి ఏట్లో నిలబడి కాలితో ఎగరజల్లితే నీల్లు గడ్డనొచ్చి పడతా వుండే. జీవాలు మన్సులు ఒక రేవున నీళ్లు తాగతా ఉంటిమి. బావులు తవ్విరి. బోర్లు ఏసిరి. ఏట్లో రెండు మూడు మట్లు ఇసక ఎత్తేసిరి. బూమి మింద గువ్వ దాగను నీల్లు లేకుండా బోయే! మనూరంతా ఎత్తుకుంటే పది బోర్లుండాయి. వాటిలో ఇబుడు నాలుగైదు బోర్లలోనే నీళ్లొస్తా ఉండేది. మన గాచారం బాగలేక ఊర్లో బోర్లు నిలిచిపోతే వాళ్ల బోర్లే మనకు దిక్కు. ఉచిత కరెంటు ఇచ్చి రేయింబవల్లు బోర్లు వదిలి, నీళ్లు బిన్నె ఎలగొట్టేసి అవి గూడా నిలిచిపోతే మన గతి కుక్కలు ఇసారిస్తాయి," అనె.

"ఇట్లాంటి దానికే మా అవ్వ ఒక కథ జెప్పేది. ఒకూర్లో ఒక ఉప్పమ్మే వాడుండే వాడు. వాడి దగ్గర ఆరేడు గాడిదలుండేయంట. ఉప్పమూటలన్నీ గాడిదల మింద ఏసుకొని ఊరంతా తిరిగి పొద్దన్నే ఉప్పమ్మేసి మద్యానంగా ఆ గాడిదలను మేపుకునేది. ఆ దేశం రాజు ఏటకని బయలుదేరి, ఏటాడుకొని నడిదోవకొచ్చి ఆడ పెద్ద మర్రి

చెట్టుంటే దానికింద యిశ్రాంతి తీసుకుంటా ఉన్నాడంట. ఈ ఉప్పోడు ఊరెనకాల కొలిమి ఉంటే ఆడ గాడిదల్ని తోలుకోని ఎర్రటెండలో మేపుకుంటా ఉండాడంట. ఈ రాజు వానికల్లా చూసినాడు. వాని గుడ్డలు అన్నీ నల్లగా అయిపోయి, చినిగిపోయి, కాళ్లకు చేతులకు చిన్న చిన్న గాయాలతో కనపడినాడంట.

"వానిని పిలిచి, 'ఏమయ్యా, దినానికి ఎంత పొద్దుదాకా యాపారం జేస్తావు,' అన్నాడంట.

"'ఏమమ్ముతానులే సామీ. పొద్దున్నుండీ అన్నం పొద్దుదాకా ఉప్పు అమ్ము కుంటా. పగలంతా ఈ గాడిదల్ని మేపుకొని మావిటేల ఒక పల్లె తిరిగి వచ్చిన డబ్బులతో పెండ్లాము బిడ్డల్ని సాక్కుంటా,' అన్నాడంట.

"'నీ దగ్గర ఎన్ని గాడిదలుండాయి,' అని రాజు అడిగినాడు.

"'ఆరేడు ఉన్నాయి సామీ,' అన్నాడు.

"రాజు ఆలోసన సేసి, ఈ ఉప్పమ్మేవాడికి ఏదైనా సాయం సేయల్ల నేను. నేను సేసిన సాయం సూసి అందరూ నన్ని మెచ్చుకోవల్ల. వీనికి ఎక్కువ కష్టం ఈ గాడిదలు మేపడం వల్లే. ఎక్కువ సమయం ఈ గాడిదల్ని మేపడానికి వృదా అవుతోంది. పైగా ఆరేడు గాడిదల్ని మేపల్ల. అందుకే ఈనికి ఒక ఏనుగును కొనిస్తా. అదైతే ఎంత బరువైనా మోస్తుంది. ఒక తావున కట్టేసి మేతేసుకోవచ్చు. ఊరంతా ఎండలో తిరగాల్సిన పనిలేదు అని చెప్పి ఏనుగును కొనిచ్చెనట.

"ఆ ఉప్పోనికి కూడా ఏనుగును చూసేసరికి సంతోషమొచ్చె. గాడిదలతో పన్లే మని వాటన్నిటినీ అమ్మేసినాడు. ఉప్పమ్మి మిగలబెట్టిన దుడ్డుతో ఆరోజు ఏనుగుకి చెరుగెల్లు, అరటివంబాలు తెచ్చి పెట్నాడు. ఆ రెయ్యి రేత్తిరి ఏనుగు తిని నిద్రపో యింది. తెల్లారి లేస్తానే ఉప్పోడు పదిమూటల ఉప్పును ఏనుగు మింద ఏసినాడు. వాడూ ఏనుగు మింద ఎక్కి ఒకూరికి పోయినాడు. ఉప్పంతా ఒకచోట దించి అమ్మతా ఉండాడు. ఆ యాలకి ఏనుగు అరిసింది. దాని దెబ్బకు ఊర్లో జనాలంతా బయపడి ఉప్పు కొనేదానికి దగ్గరికి రాలేదు. దాంతో వాడు ఉప్పు అమ్మేది కూడా నిలిపేసి మేతద్యాను ఎలిపోయినాడు. అట్లా పదిరోజులు గడిసింది. దానికి మేతబెట్టడానికి ఆ ఉప్పోడు ఇల్లు వాకిలి అన్నీ అమ్ముకున్నాడు. అట్లా దాన్ని మేపలేక అడివిలో వదిలేసి వీదినబడి చివరికి గుడిమెట్ల దగ్గర బిచ్చమెత్తుకుంటా ఉన్నాడు.

"ఒకరోజు రాజు ఆ గుడికి వచ్చినాడు. బిచ్చం అడుక్కుంటున్న ఉప్పోన్ని చూసి 'ఏమి ఇట్లుండావు,' అంటే, వాడు జరిగిందంతా రాజుకి చెప్పినాడు.

"'అట్లయితే నేను ఏమి సాయం చేసుంటే నువ్వు బాగా బతికిందువు,' అని రాజు అడిగె.

ఆ ఉప్పోడు ఉండుకొని, 'సామీ, నువ్వు నా దగ్గర సేరు ఉప్పు కొనుక్కోనుంటే సరిపోయిన్ను. నాకు ఈ పరిస్తితి వచ్చేదే కాదు. నేనన్నా నీ కంటబడకుంటా ఉంటే బాగున్ను,' అన్నాడంట. అట్లుంటాయి ఈ గవర్నమెంటోల్లు మనకు సేసే సాయా లన్నీ," అనే ఆయమ్మ.

ఆ యాలకి ఎవరి చెనిక్కాయలు వాళ్లు వొలుచుకొని పొట్లు ఇంగడిచ్చుకొని గింజలు గంపలకు పోసుకొని ఎవరిండ్లకు వాల్లం బొయ్యి ఎబుడు వానొస్తుందా అని ఆకాశం కల్లా ఎగజూసుకోనున్నాం.

వానొస్తే గింజలు భూమిలో బడి మొలస్తాయి. లేదంటే మా కడుపులో బడి పెంటవుతాయి!

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*నవంబర్ 2019*

✻



22 మార్చి 1981న చిత్తూరు జిల్లాలో పుట్టిన **ఎండపల్లి భారతి** మొదటి కథ **చావు బియ్యం** చిత్తూరు జిల్లా నుండి డిఆర్‌డిఏ వెలువరిస్తున్న నవోదయ పత్రికలో 2013లో అచ్చయ్యింది. దాదాపు 70 కథలు రాశారు. ఎదారి బతుకులు కథాసంపుటి ప్రచురించారు. మరో కథల సంపుటి ప్రచురించబోతున్నారు. కొంత మేర శిక్షణతో జిల్లా అభివృద్ధి కార్యక్రమాల పై కొన్ని లఘు చిత్రాలు తీశారు. చిత్తూరు జిల్లా డిఆర్‌డిఏలో ఉద్యోగం.

**చిరునామా:** దిగువ బురుజు, గ్రామం రెడ్డివారిపల్లి, నిమ్మనపల్లి
మండలం, చిత్తూరు జిల్లా - 517 280
*ఫోన్: 93910 06866* navobharathi@gmail.com